




# 'వాణిజ్య దౌత్యవేత్తలు కీలకం'

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): ప్రపంచ మార్కెట్‌లో వాణిజ్య దౌత్యవేత్తల పాత్ర కీలకంగా మారిందని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో 'విదేశీ వాణిజ్యం-పెట్టుబడులు' అంశంపై ఓ అవగాహన కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ నెల 30దాకా జరిగే ఈ కార్యక్రమానికి ఈజిప్టు నుంచి 14 మంది అగ్రశ్రేణి దౌత్యవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోయల్ మాట్లాడుతూ.. గ్లోబల్ మార్కెట్‌లో తాజా పోకడలు నిపుణుల అవసరాన్ని పెంచుతున్నాయన్నారు. దేశాల మధ్య దౌత్య, రాజకీయ సంబంధాలను పెంపొందించడంలో భౌగోళిక, వ్యూహాత్మక పరిస్థితులూ ప్రధానమేనన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ హెడ్ డాక్టర్ మాధవి రావులపాటి తదితరులు పాల్గొన్నారు.

## బీటీలో భారతీ గ్లోబల్‌కు 24.5% వాటా

### డీల్ విలువ రూ.33,500 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బ్రిటన్‌కు చెందిన బహుళజాతి టెలికం సంస్థ బీటీ గ్రూప్‌లో సునీల్ భారతీ మిట్టల్‌కు చెందిన భారతీ గ్లోబల్‌కు 24.5 శాతం వాటా దక్కుతున్నది. డీల్ విలువ దాదాపు రూ.33,500 కోట్లు (4 బిలియన్ డాలర్లు). కాగా, బీటీ గ్రూప్‌లోని ఆల్టీస్ నుంచి 9.99 శాతం వాటాను వెంటనే కొనేస్తున్న భారతీ.. మిగతా వాటాను రెగ్యులేటరీ అనుమతులు వచ్చాక సొంతం చేసుకోనున్నది. అధిక రుణ భారం నేపథ్యంలోనే ఈ వాటాను ఆల్టీస్ అమ్ముకుంటున్నది. ఇదిలావుంటే టాటా, మహీంద్రా, వెల్‌స్పన్ తర్వాత బ్రిటీష్ సంస్థల్లో వాటాలను పొందిన భారతీయ సంస్థగా భారతీ ఎంటర్‌ప్రైజెస్ నిలిచింది.



# గురుకులాల్లో వసతులు మెరుగుపరచాలి

- జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లకు ప్రత్యేకాధికారులను నియమించి సమస్యలు పరిష్కరిస్తాం
- విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, ఆగస్టు 12: జిల్లాలోని గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లలో వసతులు మెరుగు పరచాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో విప్ అధ్యక్షతన, జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి సమక్షంలో పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటన గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఘటనకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. పలు జాగ్రత్తలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అడ్లూరి మాట్లాడుతూ జిల్లాలోని 91 హాస్టళ్లలో మౌలిక వసతులు, వాటి మరమ్మతులకు సంబంధించి నివేదికను తయారు చేయించి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేయాలన్నారు. వారం రోజుల్లో ఒక్కొక్క హాస్టల్‌కు, ఒక్కో ప్రత్యేక అధికారిని నియమించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, ఇంజినీరింగ్ విభాగ అధిపతులు, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ అధికారులు, హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.




సమీక్షలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

## ర్యాగింగ్ చేస్తే చర్యలు తప్పవు

జగిత్యాల టౌన్, ఆగస్టు 12: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం పొలాస ప్రాంతీయ వ్యవసాయ కళాశాలలో యూజీసీ నిబంధనల ప్రకారం యాంటీ ర్యాగింగ్ డే నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడినట్లయితే వారిపై విధించే చట్టాల వల్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అనంతరం యాంటీ ర్యాగింగ్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులకు స్లోగన్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఇక్కడ డీఎస్పీ రఘుచందర్, సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ సుధాకర్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతిభట్, ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తజన సోమేశ్వర కొండ



*మల్లాపూర్ కనక సోమేశ్వర కొండ కిక్కిరిసింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాతోపాటు నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరాగా, సోమేశ్వర నామస్మరణతో మార్మోగింది. సుమారు 1600 అడుగుల ఎత్తయిన ఏక శిల కొండపై సోమేశ్వరస్వామి కొలువు దీరిన ఈ క్షేత్రంలో ఏటా శ్రావణమాసంలో ప్రతి సోమవారం వేడుకలు ఘనంగా జరుగుతాయి. ఈ క్రమంలో సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో రాగా, ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం లింబాద్రి-లక్ష్మీ, మైలారం రాంబాబు-సంతోషిణి దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగ గంగారాజం ఉన్నారు.*

*- మల్లాపూర్, ఆగస్టు 12*

## విద్యా వ్యవస్థ నిర్వహణలో విఫలం

మల్లాపూర్, ఆగస్టు 12: విద్యా వ్యవస్థ నిర్వహణలో రాష్ట్ర సర్కారు పూర్తిగా విఫలమైందని, కనీసం ఆ శాఖ మంత్రి లేకుండా విద్యాశాఖను నడిపిస్తుండడం దారుణమని వేంపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. సోమవారం గ్రామంలోని అంబేద్కర్ కూడలి వద్ద రాష్ట్ర విద్యా వ్యవస్థతోపాటు, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల అద్భుతంగా నడిచాయని, కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి గురుకులాల్లో 35 మందికి పైగా విద్యార్థులు చనిపోయారని, ఇటీవల నెల వ్యవధిలోనే పెద్దాపూర్ పాఠశాలలో ఇద్దరు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ మాజీ సర్పంచ్ వేల్పుల గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ బిట్ల నరేశ్, నాయకులు మినుగు చంద్రశేఖర్, భాస్కర్, గంగాధర్, సాయన్న, రాజేశ్, రమేశ్, చంద్రయ్య, నరేశ్ పాల్గొన్నారు.


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

# తక్కువ ధరకే నిత్యావసరాలు పంపిస్తామని చెప్పి

- కొడిమ్యాలలో సైబర్ మోసం
- యువకుడికి రూ.26 వేలు టోకరా

కొడిమ్యాల, ఆగస్టు 12: ఆఫర్ ఉందని, తక్కువ ధరకే నిత్యావసర సరుకులు ఇస్తున్నామని చెప్పి ఓ యువకుడిని సైబర్ నేరగాళ్లు మోసం చేసిన ఘటన కొడిమ్యాలలో జరిగింది. కొడిమ్యాలకు చెందిన చిర్ర మహేశ్ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తుంటాడు. మహేశ్‌కు సోమవారం మధ్యాహ్నం తనకు ఫోన్ వచ్చింది. డీమార్ట్ నుంచి ఫోన్ చేస్తున్నామని, లక్కీ డ్రాలో మీరు ఎంపికయ్యారని చెప్పారు. మీకు ఆఫర్‌లో తక్కువ ధరకే నిత్యావసర సరుకులు అందిస్తామని.. తీసుకుంటారా..? అని అడుగగా, మహేశ్ ఓకే అన్నాడు. రూ.290కే ఐదు కేజీల షుగర్, 5 కేజీల పిండి ప్యాకెట్, బాస్మతి రైస్ ఇస్తున్నామని, తాము పంపే లింక్ ఓపెన్ చేయాలని నమ్మించారు. ఈ క్రమంలో మహేశ్ తన మొబైల్‌కు వచ్చిన లింక్ ఓపెన్ చేశాడు. ఆ కొద్దిసేపటికే అకౌంట్ నుంచి రూ.7 వేలు, మరోసారి రూ.19 వేలు డ్రా అయ్యాయి. మోసపోయానని గుర్తించిన మహేశ్, వెంటనే కొడిమ్యాల ఠాణాకు వెళ్లాడు. పోలీసు సిబ్బంది సూచనల మేరకు ఆన్‌లైన్‌లో సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.